# జోక్

మందడి తిలక్

'టూ ఇన్నోసెంట్!'

"నువ్వు ఇక్కడే బండి దగ్గర నించోనుండు. నేను, రామయ్యా లోపలికెళ్ళి ప్లాట్ ఫామ్ మీద పెట్టిన మన లగేజీ తీసుకొస్తాం" చెప్పేడు కామేశం.

"అలాగే" అంటూ తల వూపింది వాణి, ఎదురుగావున్న వొంటెద్దుబండి వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

చాలా చిన్న రైల్వేస్టేషనది.

చుట్టుపక్కల వున్న రెండు మూడు వూళ్ళకి కలిపి అదే స్టేషను.

పుట్టిన దగ్గర్నుంచీ ఇంత వరకూ బొంబాయి పోష్ ఏరియాల నుంచి ఇవతలకు రాని వాణికి చుట్టూవున్న పొలాలు, చెట్లూ, చేమా ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. కామేశంతో రెండేళ్ళ పరిచయం ఆమెది. పరిచయం ప్రేమగా మారి కొద్ది నెలలైంది. "సరదాగా ఓ వారం మా వూళ్లో గడుపుదువుగానీ రా" అంటూ కామేశం పిలిస్తే వొచ్చిందామె. రైలు దిగగానే ఆమెని వాళ్ళ కోసం వేచివున్న బండి దగ్గర నించోబెట్టి, లగేజి తేవాలంటూ మళ్ళీ స్టేషన్ లోపలికి వెళ్ళేడు కామేశం.

కొద్ది నిముషాల తర్వాత లగేజీతో సహా, నౌకరు రామయ్య, కామేశం బండి దగ్గరికి వొచ్చేరు. సామాను లోపలకి పడేసి, ముందువైపుకి ఎక్కి కూర్చుని, ముల్లుకర్ర చేతిలోకి తీసుకున్నాడు రామయ్య.

వొక్క గెంతులో బండిలోకి ఎక్కి, "నువ్వూ ఎక్కు" అన్నాడు కామేశం, వాణి వైపు చూస్తూ.

తల అడ్డంగా వూపింది వాణి.

"అదేవిఁటి?" అయోమయంగా అడిగేడు కామేశం.

"బండి నడవదు"

కామేశం తెల్లబోయేడు "ఏవిఁటి నువ్వనేది?"

"నిజం కామేశం!" నమ్మకంగా అంది వాణి. "నేను చూసేను కదా! మీరొచ్చే ముందే బండి ఇంజనులోంచి పెట్రోలంతా కారిపోయింది."

వొంటెద్దు బండికి ఇంజనేవిఁటి? అందులోంచి పెట్రోలు కారిపోవడమేవిఁటి? అర్థం కాలేదు కామేశానికి. అయోమయంగా అటూ ఇటూ చూసేడు. అప్పుడు కనపడిందతనికి—

రామయ్య ముల్లు కర్రతో పొడుస్తున్న "ఎద్దు" శరీరభాగం. దానికి సరిగ్గా కింద నేలమీద వున్న తడి.

తెరలు తెరలుగా వొచ్చిన నవ్వును ఆపుకోలేకపోయాడు కామేశం. సంగతివిన్న రామయ్య ముసి ముసిగా నవ్వేడు. ఇద్దర్నీ చూసి ఉక్రోషపడి బుంగమూతి పెట్టుకు కూర్చుంది వాణి.

ఇల్లు చేరేక, ఇంట్లో తల్లికీ, తండ్రికీ చెల్లెళ్ళకీ అందరికీ ఆ జోక్ చెప్పేడు కామేశం. "మరీ అమాయకప్పిల్ల" అన్న బిరుదిచ్చేరందరూ వాణికి, నవ్వుకుంటూ.

రాత్రికి మేడమీదున్న గెస్ట్ రూంలో పడుకుంది వాణి. పొలాలమీద వీస్తున్న గాలి, కీచురాళ్ళరొద సద్దుమనిగిన చీకట్లో తొందరగా నిద్ర పట్టేసిందామెకి.

అర్ధరాత్రప్పుడు, ఎవరో తన పక్కగా కూర్చున్నట్టు అనిపించి చటుక్కున లేచి కూర్చుని, ప్రక్కనేవున్న లైట్ స్విచ్ వెయ్యబోయింది.

చటుక్కున చేయి పట్టుకుని "ష్ గోలచెయ్యకు నేనే, కామేశాన్ని" అందా ఆకారం మెల్లిగా.

"నువ్వా. ఇదేంటి ఈ వేళప్పుడు...!!" అంటూ ఆశ్చర్యపోయింది వాణి, లైటు వేసి కామేశం వంక వింతగా చూస్తూ

మంచంమీద కూర్చునున్న వాణి భుజాలమీద చేతులువేసి దగ్గరికి లాక్కుని, పెదవులమీద ముద్దు పెట్టుకున్నాడు. గింజుకుంటున్న వాణిని, గట్టిగా అదింపట్టుకుని కౌగిలించుకుని మంచం మీదకి వొరగబోయేడు.

కామేశం మాట్లాడలేదు.

చాచి అతని దవడమీద వో లెంపకాయ అందుకుంది వాణి. బిత్తరపోయి వెనక్కి జరిగిన కామేశం మోకాల్చిప్పమీద వో నల్లకాయ లాగించి, అనక మంచం దిగి పారిపోబోతున్న వాడిని తొడపాశం పెడ్తూ వెనక్కి లాగి "ఏవిఁటి హీరో, ఈ పని?" అనడిగింది దబాయిస్తూ.

నెత్తి కొట్టేడు కామేశం "వొదలెయ్యి వాణీ. పూరిఖే అన్నమాట. జస్ట్... !!" అంటూ.

చిరునవ్వు నవ్వేసి, వో మొట్టికాయకొట్టి "ఈ వేషాలన్నీ పెళ్ళయ్యాక. అందాకా ఇలాంటివి కుదరవు. బీకేర్ఫుల్" అని పంపించేసింది వాణి. అనంతరం దుప్పటి ముసుగెట్టుకుని మళ్ళీ నిద్ర కొచ్చేసింది.

* * *

పెళ్ళయాక మొదటి రాత్రి.

వాణిని దగ్గరకి తీసుకున్నాడు కామేశం. సిగ్గుపడుతూ దరి చేరిందామె.

మెల్లిగా అన్నాడు కామేశం "రెణ్నెల్ల క్రితం ఇదే గదిలో ఇదే మంచం మీద నాకు జెల్లకాయలూ, టింకి జెల్లలూ ఇస్తున్నావు గుర్తుందా?"

ముసిముసిగా నవ్వుతూ తల దించేసుకుంది వాణి.

"నిజం చెప్పనా వాణీ?" మళ్ళీ తనే అన్నాడు కామేశం. "నేనూ అందరు మొగవాళ్ళ లాంటి వాడినే ఆరోజు నువ్వే గనక అందుకు వప్పుకునుంటే ఈ పెళ్ళి జరిగేదే కాదు."

మెల్లిగా కళ్ళెత్తి చూసింది వాణి.

కామేశం మెడ చుట్టూ చేతులు వేసి అంది అమాయకంగా "నాకు తెల్సు కామేశం" వొక్క క్షణం ఆగింది. "అలాగేగా నేను ఇంతకు ముందు నలుగుర్ని పోగొట్టుకుంది..." *